## కథ

# కాకిగోల

ఈతకోట సుబ్బారావు



''డాడీ! దేవుడు కూడా ఈ వరదల్ని ఆపలేడా?''టీవిలో వార్తలు చూస్తున్న ఉదయ్ చిట్టి బుర్రలో తళుక్కుమన్న ఆ అమాంతపు ఆలోచనకి మొదట వులికి పడ్డా, వెంటనే సర్దుకున్నాన్నేను.

''దేవుడి గుడిలోకే వరద నీళ్లొచ్చేశాయిరా కన్నా!'' కాఫీ కలిపి తెస్తూ ప్రసూనే కొడుకు ప్రశ్నకి జవాబు కాని జవాబు చెప్పేసింది. వాడి సందేహ నివృత్తి బాధ తప్పినందుకు హాయిగా వూపిరి పీల్చుకున్నాను. ఉదయ్ బుర్రని అనుమాన పిశాచి తొలిచిందంటే ఓ పట్టాన వొదిలిపెట్టదు.

''అయితే ఏం! దేవుడు దేవుడేగా, ఆపొచ్చుగా. ఆ పిల్లల్ని చూడు ఎలా గుక్కపట్టి ఏడుస్తున్నారో... ఆపొచ్చుగా డాడీ!'' కాఫీ అందించి ప్రసూన వంటింట్లోకి వెళ్లిపోయింది, నాకు తప్పని మేళం. ఇక ప్రశ్నల వర్షమో, తుఫానో ఎదుర్కోవాలి. లేదంటే సగం బట్ట తలకి మూడినట్టే. అందుకే వాడి ప్రశ్నలపైన విరుద్ధ తర్కం వుపయోగిస్తుంటాను తప్పించుకోవడానికి. అంతకంటే మార్గం వుండదు మరి.

''ఎందుకాపాలిరా...?'' తొలి వితండం.

''ఎందుకంటే దేవుడు కాబట్టి..!'' వాడెప్పుడు ఓ ఆకెక్కువే.

''దేవుడైతే ఆపాలని రూలుందా?'' రెండో వితండంతో నేను.

''రూల్స్ గీల్సూ మనుషులకే గాని..గాడ్స్‌కి వుండవు...నువ్వేగా ఈ విషయం చెప్పింది''

అమ్మో! ఆగ్నేయాస్త్రం ఎదురు తిరిగింది. ఇప్పుడేదో మాయమడి వేయకపోతే బయటపడ్డం కష్టం.

''మనుషులకి రూల్సుంటాయని తెలిసీ ఇందాక కాకుల్ని తరమరా అంటే నువ్వు డాడీ మాట విన్నావా?'' నిజానికది దొడ్డిదారి ప్రశ్న.

''వరద నీళ్లకి, పెరట్లో కాకులకీ ఏంటి డాడీ, సంబంధం?'' ఈడ్చి ముఖంమీద కొట్టినట్టుంది వాడి జవాబులోని ప్రశ్న.

''డాడీ చెప్పిన మాట, కన్న ఓన్ సన్నే వినకపోతే, ఆకాశంలో కూచున్న కోన్ కిస్కా దేవుడు మాత్రం నీ మాటెందుకు వింటాడు చెప్పరా?'' ఇక వాడి గోల కట్ అని సంబరపడిపోయాను. కాని వాడి జవాబులోని జడ్జిమెంటు అదరగొట్టేసింది.

''యూవార్ రాంగ్ డాడీ! నువ్వు కాకుల్ని తరమమన్న కాంటెస్ట్ వేరే...వరదలొచ్చి ఇళ్లన్నీ మునిగిపోతున్న కాంటెక్స్ట్ వేరే. కాకుల్ని ఇవాళ కాకపోతే రేపు తరుముతాం. వరదల్ని ఇవాళ ఆపకపోతే రేపు ఆపడానికి ఎవరైనా మిగిలుంటారా?''

నేను జవాబు చెప్పడానికి తడుముకునే అవసరం లేకుండానే ప్రసూనే అడగని వరంలా వచ్చి కాపాడింది. థాంక్స్ టు దేవుడుగారు.

''నాన్నా ఉదయ్! స్కూల్ బస్సొచ్చే టైమవుతుంటే, ఇంకా దేవుడు, వరదలంటూ డౌట్స్ ఏంటి నాన్నా! లే..లే... వెళ్లి స్నానం చెయ్ పో... బి క్విక్ ఐసే...'' ప్రసూన మాట పూర్తికాకముందే ఉదయ్ బాత్‌రూమ్‌లోకి పరిగెత్తాడు.

'తప్పించుకున్నారా దేవుడా' అనుకుంటూ సంబరపడ్డానే కాని, నేను చెప్పినా ఉదయ్ పెరట్లో కాకుల్ని తరమలేదన్న విషయం మాత్రం ఎక్కడో కెలుకుతూనే వుంది. వాడు కాకుల్ని తరమలేదన్న చింత కాదు. ఈ వయసుకే వాడు చెప్పిన మాట విన్పించుకోవడం లేదన్న బాధ. ఇంత చిన్న విషయానికే అంత బాధపడాలా అన్న సందేహం కలిగితే మాత్రం ఓ చిన్న పాటి కథ వెనకటి భాగం చెప్పుకోవాలి.

మాది తాత ముత్తాతల తరం నాటి ఇల్లు. నాకంటూ స్థిరచరాస్థులంటూ ఏదైనా వుంటే అదొక్కటే. పాత తరంలో కట్టింది కావటాన ఇంటి కంటే విశాలమైన పెరడు. పెరట్లో మా ముత్తాత నాటిన వేపచెట్టు. ఇంతై వటుడింతింతై అన్నట్టు నూట యాభై ఏళ్లు వయసుని మోస్తున్న చెట్టు. అందరికీ ఉదయం కోడికూతతోనో, కోయిల కుహూ కుహూల తోనే ఆరంభమైతే మాకు మాత్రం కాకిగోలతో మొదలవుతుంది. ఆ గోల భరించలేక రోజూ ఉదయాన్నే కాకుల్ని తరమటం నా ఫస్ట్ డ్యూటీ. ఎప్పుడైనా వొళ్లు బద్ధకిస్తే ఆ డ్యూటీ మా ఆవిడ ప్రసూన భుజాన వేసుకుంటుంది. పండక్కో పబ్బానికో అన్నట్టు ఇద్దరికీ కుదరకపోతే ఏడాదిలో ఒకటో రెండో మార్లు మా ఉదయ్‌కి చెప్తుంటాం.

ఆ కాస్త పని వాడు చేయలేదని కాదు, చెప్పిన మాట వినడం లేదని. అదీ ఐదేళ్ల వయసు దాటి దాటకుండానే. ఈ వయసులోనే ఇంత బిరుసైతే... ఇక అమ్మానాన్నల్ని పోషించే స్థాయి కొస్తేనో... అసలా స్థాయి చేరుకునే లోపల వాడు వాడుగా మిగులుతాడా? లేక వాడిలో మరో మనిషి ఎదుగుకొస్తాడా? అమ్మానాన్నల ఫీలింగ్స్‌ని అర్థంచేసుకొనే పరిస్థితి ఇప్పటి తరానికి లేకుండా పోయింది. మరి రేపటి తరం సంగతో? అదండీ ఉదయ్ కాకుల్ని తరమలేదన్న బాధ వెనక దాగిన కత.


ఉదయాన్నే కాకిగోల వినని వాళ్లకి ఇదో ప్రహసనంగా వుండచ్చు. కాని భరించే వాళ్లకి మాత్రం అది ప్రసవ వేదనే!


***

ఆఫీసుకెళ్లే దార్లోనే ఉషోదయా నర్సింగ్ హోం కూడా వుంది. అక్కడ అమ్మకి క్యారియర్ అందించాలి. ఆర్నెల్ల నుంచి ఇదో అదనపు డ్యూటీ. ఆర్నెల్ల కింద ఫిట్స్‌తో అమ్మని ఆ నర్సింగ్ హోమ్‌లో చేర్చాను. అది మిడిల్ క్లాస్ వాళ్లకి అందుబాటులో వుంటుందని. అందుబాటు మాటెలా వున్నా తడిసి మోపెడైంది మాత్రం నిజం. ఫిట్స్‌కి పరీక్షలు చేస్తుంటే మధ్యలో షుగర్ బయటపడింది. షుగరే కదా అని తియ్యగా బాధపడడం కుదిరే పని కాదు కదా. కాసులతో వ్యవహారం. అడ్డంగా సంపాయించే అవకాశం లేని ప్రభుత్వోద్యోగికి, అందునా ఇద్దరు పిల్లల తండ్రికి ఒక భార్య వున్న భర్తకి, కన్న వృద్ధ తల్లిని మోస్తున్న కొడుక్కి, జీవితం ఎంత బరువో తూచి చెప్పగలిగిన సామర్థ్యం ఎవరికుంటుంది?

ఈ ఆర్నెల్ల కాలంలో అమ్మ ఫిట్సూ, షుగరూ ద్విముఖ దాడి చేసి అరవై వేల దాకా నానెత్తిన అప్పుల ముల్లె పెట్టాయి. పరిచయమున్న ప్రతి ముఖం నన్ను చేరుకునేలోగానే ఆటోనో, కారునో, సిటీబస్సునో, అవేవీ వీలుకాని పక్షంలో ఎదురుపడ్డ అడ్డ వీధినో చాటు చేసుకొని తప్పుకు పోవడానికి అలవాటు పడిపోయారు. నన్ను చూడగానే ప్రతి ముఖం మూడో నెంబరు ప్రమాద సూచికని ఎగరేస్తుంది. తుఫాను తీవ్రతను చాటుతున్నట్లు చివరకి ఆఫీసులో కూడా మా ఆఫీసరు మేష్టారు నన్ను చూడగానే నా కంటే ముందు తనే లేచి నమస్కారం పెట్టేస్తున్నాడు. ఆ నమస్కారంలోనే చేతులెత్తేస్తున్న సూచన రేఖా మాత్రంగానైనా అర్థమై తీరుతుంది. ఆఫీసు తాలూకు లోన్లూ, ఆఫీసు కొలీగ్ తాలూకు చేబదుళ్లు, బయటి మిత్రుల తాలూకు అప్పులు అన్ని దార్లూ మూసుకుపోయాక, నా అసమర్థత మీద కాకుండా అమ్మకొచ్చిన మాయరోగం మీద కోపం నసాళం వరకూ చేరుకుంది. ఇక మిగిలిందల్లా రెసిడెన్షియల్ స్కూల్లో సెవెంత్ చదువుతున్న నా కూతురు శైలజ పెళ్లి కోసమని ఇప్పటి నుంచే దాస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ మాత్రమే. దాన్ని తాకే హక్కు కూడా నాకు లేదు. ఎంత బ్యాంకు వాళ్లు లోన్ ఇస్తామన్నా మా ప్రసూననే అర్థరాత్రి నిద్దర్లోనో వుండగా గొంతుపైన కాలేసి తొక్కినా తొక్కేస్తుంది. స్త్రీ ధనం పట్ల కంటే కూతురు ధనం పట్ల అంత వల్లమాలిన ప్రేమ ఆవిడకి. కాబట్టి అష్టదిక్కుల నుంచి నేను అరెస్ట్ అయిపోయినట్లే.

అందుకే ఆ క్షణమే ఓ నిర్దిష్టమైన నిర్ణయానికొచ్చేశాను. కొట్లుపోసినా పోయే ప్రాణాన్ని ఆపలేం. విషమిచ్చినా ఆయుష్షుంటే చంపలేం. అంచేత నేను ఖర్చులు భరించలేని నా నిస్సహాయత దృష్ట్యా, అమ్మని వెంటనే నర్సింగ్ హోం నుంచి సర్కారీ దవాఖానాకి మార్చేయాలనుకున్నాను. ఇప్పటికే నెత్తిన అప్పుల కొండ మోస్తున్నాను. దానిపైన మరో గులకరాయి పెట్టినా అది నా పాలిట వామనపాదమై నన్ను ఆరడుగుల్లోతు నేల్లోకి దించేస్తుంది. కాబట్టే మధ్యతరగతి మహాత్ముడిగా సాయంకాలం ఆఫీసు నుంచి వెళ్లగానే అమ్మని సర్కారీ దవాఖానకి షిఫ్ట్ చేసిగాని స్ట్రిక్ట్‌గా ఊపిరి పీల్చకూడదన్న నాగార్జునా సిమెంట్‌తో వేసిన పునాదిలాంటి దృఢమైన నిర్ణయం తీసుకున్నాను.






నిర్ణయం తీసేసుకున్నాక నిదానంగా మెదళ్లో మరో మెరుపు మెరిసింది. సర్కారి దవాఖానంటే సన్నాసుల మఠం లాంటిది కాబట్టి ఏకంగా ఇంటికెళ్లి ఓ దిండూ దుప్పటి సర్దుకొని, ఆ తర్వాత సరాసరి నర్సింగ్‌హోంకి చేరుకుని అమ్మని డిస్చార్జ్ చేయించడం ఉత్తమమని. ఎంతైనా అనాథల ఆస్పత్రి కదా దుప్పటీ దిండూ వుంటే వుండొచ్చు, లేకనూపో వచ్చు. అప్పుడప్పుడూ ఇలాంటి సిక్స్త్ సెన్సులు నా బుర్రలో తళుక్కుమని నేనూ మేధావి వర్గానికి చెంది నవాణ్నే అన్న కఠోర సత్యాన్ని రుజువు చేస్తుంటాయి. కన్న కొడుగ్గా నా ఆలోచన తప్పుని ఎవరైనా అంటే అనొచ్చు కాని నా సమాధానం నాకుంది. మా అమ్మ కొడుకునైతే కన్నది కాని, కొడుక్కు అదృష్టాన్ని కనలేక పోయింది. పైగా నేనేం చేతులు ముడుచుకొని కూచో లేదు. చేతనైందేదో చేస్తూనే వున్నానుకదా!

***

ఇల్లు దగ్గర పడుతున్న కొద్దీ, ఆకాశవాణి వాల్యూమ్ పెంచినట్లు అంతకంతకీ కాకిగోల స్పష్టంగా డిజిటల్‌సౌండ్ సిస్టమ్‌లో లాగా వినపడు తూనే వుంది. అదిగో...అడ్డదిడ్డంగా ఎగురుతున్న నల్లకాకులూ కనపడుతూనే వున్నాయి.

ఎప్పుడు వేసివుండే తలుపులు బార్లా తెరిచి వున్నాయి. తీరా గుమ్మంలోకి అడుగుపెట్టగానే కాకి గోలతో పాటు కలహంస వెక్కిళ్లు వినిపించాయి. మా ప్రసూన సోఫా కింద కూచుని మరీ వెక్కివెక్కి ఏడు స్తోంది. అమ్మకేమైనా అయిపోయిందా అన్పించి క్షణం గుండెకాయ బెత్తెడు కిందకి జారిపోయింది. అమ్మ పోవడం నేను భరించగలనా అన్పించిందో క్షణం–

"ఏమైంది ప్రసూనా? అంతా క్షేమమేగా?" నా ఆదుర్దా మా ఆవిడకి తూ.చ. తప్పకుండా అర్థమైపో యింది వెంటనే–

"అమ్మ గురించి కాదండీ! బాబు గురించి.." అంది.

అంతే నా పై ప్రాణాలు పైపైకే వెళ్లిపోయాయి. "బాబు కేమైంది? తర్వగా చెప్పు ప్రసూనా!" గాభ రాగా అడిగాను.

ఆ క్షణం మా ఆవిడ పెట్టిన సీరియస్ ఫేసు, నిజ్జంగానే సినిమాలో సత్యభామని గుర్తుకు తెచ్చింది. అంత ఆందోళనలోనూ...

"బాబుకేం కాలేదు. అయ్యిందల్లా నాకే" అంది బహు సీరియస్‌గా

"నీకా బాగానే వున్నావుగా. నీకేమైందిప్పుడు?" కాస్త తేరుకుంటూ అడిగాను.

"అయ్యిందేదో కనిపించేట్టు అయితేనే అయి నట్టా? అంతే లెండి. మీదీ ఆ మగజాతేగా.. ఆ బుద్ధి ఎక్కడికి పోతుంది?" అదేదో మంగలం మీద పడ్డ నట్టు ప్రసూన ఒక్క సారిగా దాడిచేసింది ఏక మొత్తంగా.

"అబ్బా... సస్పెన్స్...సినిమాల్లో డైలాగుల్లాగా ఆ వాగుడేంటి. ఏం జరిగిందో చెప్పకుండా ఆ వెక్కు డేందీ.... అసలేమైందే... ఏం జరిగింది?" కాస్త విసు గ్గానే వున్నా దాన్ని కొంచెం కవర్ చేసుకుంటూ మెల్లగా అడిగాను.

"ఔనాను...మావి వెక్కిళ్లే... దెబ్బ తగిలిన వాళ్లకే కదా నొప్పి తెలిసేది.."

ప్రసూన ధోరణి ఎప్పుడూ ఇంతే. ఉదయ్ కూడా వాళ్లమ్మ పోలికే.

"కొంపదీసి పడ్డావా ఏవిటే.." ప్రసూనా! డైలాగు వర్షం చాలించి అసలు విషయమేమిటో... ఏం జరి గిందో త్వరగా చెప్పు. నా కిప్పటికే బీపీ 160/140.. ఇంకా సస్పెన్సు డైలాగులు పీకితే మెదడుచిట్లి అయి పోయే ప్రమాదం ముంది...." ప్రపంచంలో ఆడవా ళ్లని భయపెట్టగల బ్రహ్మాస్త్రం ఇంతకంటే మరొకటి కనిపెట్టబడిందో లేదో తెలీదు కాని దెబ్బకి మా ఆవిడ దెయ్యం దిగిపోయింది.

"రామ రామ... అదేం మాటలండీ.. అసుర సంధ్య వేళ..." లెంపలేసుకుంది ప్రసూన.

"అందుకే విషయానికి రమ్మంటున్నది. అస లింతకీ ఏం జరిగింది?"

"మీ సుపుత్రుడు..."

"అవును నాకు సుపుత్రుడు, నీకు పుత్రుడూను.. అయితే ఏంటి?"

"అయితే ఏంటేంటండి... ఆ బొటన వేలు వెధవ... అప్పుడే వాడికంత రోషం, ఆవేశం, దే నికంట? ఒక్క పూటకి వాడు వాడేసబ్బు లేకపోతే మరో సబ్బుతో స్నానం చేయలేడా?" అంటూ ఊపిరి పీల్చుకుంది ప్రసూన. మళ్లీ మొదలుపెట్టింది.

"అక్కడికీ సాయంత్రం మీ డాడీ వస్తే తెప్పి ద్దాంలే నాన్నా! ఈ పూటకి సర్దుకోరా..అనడం ఆలస్యం... ఈడ్చి విసిరేసాడు.."

"ఏంటి చెంబే..." అదేగా విసరడానికి చేతిలో వుండేది.

"చెంబు కాదండీ... సబ్బు...." మళ్లీ ఏడ్వడం మొదలు పెట్టింది.

"పోన్లేవే వెధవ సబ్బే కదా... పోతే పోయింది...." ఏదో సమర్థింపుగా అన్నాను.

"ఆ సబ్బే... వాడు విసిరితే ఎక్కడ తగిలిందో అది తెలుసా?" మిన్నాగుబుసలా వుందా మాట.

"ఎక్కడా..?" సంధి కోరే ప్రతి మగాడూ శ్రీకృష్ణ డిలా నటించాల్సిందే.

"అదే ఎక్కడే...?" మళ్లీ రిపీట్ చేశాను.

"వాడికి పాలు పట్టిన చోట"

అంతే ప్రసూన వెక్కిళ్ల పరిస్థితేంటో గాని నాకు మాత్రం గుండె మీద పిడుగులాంటి చేత్తో ఛళ్లున చరి చినట్లయింది. కాని ఆ తర్వాత ప్రసూన చెప్పిన ఆ ఒక్కమాటే నన్ను యేడు పాతాళాల కిందకి తొక్కే సింది.

"ఐదేళ్ల నుంచి... ఐదేళ్ల నుంచి ఆ గుండె మీదే పడుకోబెట్టుకుంటున్నానండీ వాణ్ని..."

ఆఫ్టాల్ ఓ సబ్బు ముక్కని ఐదేళ్లు పెంచిన కొడుకు విసిరితే ఈ కన్నతల్లి ఇంత బాధపడిపోతుందే...మరి నలభై అయిదేళ్ల నుంచి నన్ను గుండెల్లో పెంచుతున్న మా అమ్మని వున్న పళాన నర్సింగ్ హోం నుంచి సర్కారీ దవాఖానకి, దిక్కులేనోళ్ల ఆస్పత్రికి మారిస్తే... తనెంత బాధపడాలి....? ఆ బాధకి ఉపమాన ముంటుందా? సముద్రంతోపోల్చినా అది చిన్న పాయలాగే వుంటుందేమో...

తెలిసో తెలియకో నన్ను కొడుగ్గా కన్నందుకు ఎంతో నమ్మకంగా ఊపిరి పీల్చుకొని వుంటుంది మా అమ్మ. తనో, తన పెనిమిటో ఇద్దర్లో ఎవరు ముందుగా వెళ్లిపోయినా కొండంత కొడుకు అండగా వుంటాడు కాబట్టి మిగిలిన నాలుగు ఊపిర్లూ ధైర్యంగా లాగించేయవచ్చు. అసలా మాటకొస్తే ఎదిగి ప్రయోజకుడై చైనా గోడలాగా అడ్డంగా నిలు చుంటే ఆ కొడుకుని దాటి మృత్యువు తనదాకా రాగ లుగుతుందా అని కూడా ఆలోచించి వుంటుంది. నా కొడుకు నన్ను ఫారిన్ డాక్టర్‌కి చూపించైనా మృత్యువు గుమ్మం లోంచి చేయి పట్టుకొని లాక్కొని రాడూ అని అపార నమ్మకాన్ని పెంచుకొని వుంటుంది. కాని కొడుకు మాత్రం సర్కారీ దవాఖానా గూర్చి ఆలోచి స్తున్నాడు బతికుండగానే వెధవ లాజిక్కులతో అమ్మ శవయాత్రకి సన్నాహాలు చేస్తున్నాడు. ఛీ...వోరీ నా కొడకా....

ఆ క్షణమే నిర్ణయం తీసుకొన్నాను. శైలజ పేరు మీదున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ పైనా లోను తీసైనా సరే అమ్మకి నర్సింగ్‌హోమ్‌లోనే ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను. అనాథ ఆస్పత్రి సర్కారీ దవాఖానాలో మాత్రం కాదు.

***

కాకులు అరుస్తూనే వున్నాయి.

కానీ, గోలగా తోచడం లేదు.

గాత్ర కచేరీ చేస్తున్నట్లుంది.

మనసు ఆనందంగా... ఆహ్లాదకరంగా వుంది.

★